

మణికొండలోని శ్రీకృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

రహదారుల విస్తరణపై సమీక్ష



అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: రహదారుల విస్తరణపై రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ హెచ్‌ఆర్‌డీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శంషాబాద్, నార్సింగి పరిధిలో మొత్తం 200 కోట్ల 25 లక్షల నిధులతో విస్తరించనున్న రహదారుల గురించి ఆయన సంబంధిత అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంషాబాద్ పట్టణంలో జీఎంఆర్ స్కూల్ మలుపు నుంచి రైల్వేగేటు, బస్టాప్ నుంచి ఒయాసిస్ స్కూల్ వరకు, తొండుపలి నుంచి ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు వరకు విస్తరించే పనులపై ఆరా తీశారు. అదే విధంగా మంచిరేవుల వద్ద లింకు రోడ్డు కలుపుతు ఓఆర్ఆర్ సర్వీసు రహదారులు, లియోపోలీస్ లేఅవుట్ కోకాపేట్ నుంచి పైప్‌లైన్ లింకురోడ్లు సంబంధిత పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో హెచ్‌ఆర్‌డీసీఎల్ డీఈ విజయ్‌కుమార్, ఏఈ విక్రమ్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, ఏఈ నరేష్ తదితరులున్నారు.

న్యాయ పోరాటం చేసి బాధితులను ఆదుకుంటాం



ఇళ్ల స్థలాల డాక్యుమెంట్లను లలితారెడ్డికి అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, బాధితులు

అత్తాపూర్: మూసీ బాధిత కుటుంబాలకు శాశ్వత పరిష్కారం దొరికేంత వరకు న్యాయ పోరాటం చేసి బాధితులను ఆదుకుంటామని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుర్రంపల్లి యాదగిరి, నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భరత్‌నగర్ కాలనీలోని మూసీ పరీవాహక ప్రాంత నివాసిత బాధితులకు సంబంధించిన డాక్యుమెంట్లను బాధితులతో కలిసి బీఆర్ఎస్ లీగల్ సెల్ అడ్వైజర్ లలితారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా లలితారెడ్డి మాట్లాడుతూ.. మూసీనది సుందరీకరణ పేరుతో ప్రజలు నిర్మించుకున్న గృహ నిర్మాణాలను హైడ్రా పేరుతో బాహుబలి మిషనరీల సహాయంతో నేలమట్టం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్‌సింగ్, కైలాష్, అశోక్ శర్మ తదితరులున్నారు.



ప్రారంభానికి సిద్ధమైన మున్సిపాలిటీ నూతన భవనం

ఎట్టకేలకు.. ముహూర్తం ఖరారు

- 5న ప్రారంభించనున్న మంత్రి శ్రీధర్‌బాబు
- 22 గదులు, ఒక కౌన్సిల్ హాలు
- ఖర్చు చేసిన నిధులు రూ.6 కోట్లు

ఐదేళ్లుగా ఇరుకు గదుల్లో కొనసాగిన మున్సిపాలిటీ కార్యాలయం ఇక విశాలమైన ప్రాంగణంలోని ఆధునిక నూతన భవనంలోకి అడుగు పెట్టబోతోంది. సకల హంగులతో నిర్మాణం చేసిన నూతన పురపాలక సంఘం కార్యాలయానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 5న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా కొత్త భవనం ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు.

శంషాబాద్

ఖ్యాతికి తగ్గట్లుగా..



అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చారిత్రాత్మకమైన ప్రాంతంగా శంషాబాద్‌కు మంచి పేరుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయం కూడా విశాలంగా ఉండాల్సిన అవసరముంది. అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుని కొత్త కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. భవిష్యత్తు అవసరాలకు కూడా ఇలాంటి కార్యాలయం అవసరం ఎంతో ఉంది.

- ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



భవనంలోని కౌన్సిల్ హాలు

ఏడాదిలోనే పూర్తయిన మున్సిపాలిటీ కార్యాలయం

అనేక ఇక్కట్లు..

2019 మార్చి నెలలో శంషాబాద్ మున్సిపాలిటీ తొండుపల్లిలో పంచాయతీ కార్యాలయం ఏర్పడింది. శంషాబాద్ మేజర్ గ్రామపంచాయతీ కొత్వాల్‌గూడ, సాతంరాయి విలీనమనంతరం 2019 మే నెల నుంచి శంషాబాద్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం కాస్తా మున్సిపాలిటీ కార్యాలయంగా ఏర్పాటు చేశారు. 2020 కొత్త పాలకవర్గం ఏర్పడిన తర్వాత కూడా కనీసం కౌన్సిల్ సమావేశాలు నిర్వహించుకోవడానికి మండల పరిషత్ కార్యాలయం సమావేశమందిరంపై ఆధారపడాల్సి వచ్చింది. దీనికి తోడు పార్కింగ్ ఇబ్బందులతో పాటు అధికారులకు సరైన గదులు లేకపోవడంతో అనేక అవస్థలు పడాల్సిన సందర్భాలు కూడా చోటు చేసుకున్నాయి. రెండేళ్ల కిందట జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఇక్కడి పరిస్థితి చూసి కొత్త భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా సూచించారు. దీంతో నూతన భవనం కోసం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సహకారంతో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్‌తో పాటు కౌన్సిల్ సభ్యులు కొత్త కార్యాలయం ఏర్పాటుకు అడుగులు ముందుకేశారు.



మున్సిపాలిటీ భవనంలోని గదులు

అన్ని హంగులతో...

పట్టణంలోని సింప్లెక్స్ వద్ద హెచ్ఎండీఏకు చెందిన 30 గుంటల స్థలాన్ని కొత్త మున్సిపాలిటీ కార్యాలయానికి కేటాయించారు. ఈ మేరకు 2023 సెప్టెంబరు 29న నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి మొత్తం 5.70 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. ఇందులో టీయూఎఫ్ఐడీసీ నుంచి 4 కోట్లు నిధులు కేటాయించగా, సాధారణ నిధుల నుంచి 1.70 కోట్ల నిధులు కేటాయించారు. మొత్తం 5.70 కోట్ల నిధులతో జీప్లస్ టూగా నిర్మాణం చేసిన ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో 4 గదులు, ఫస్ట్‌ఫ్లోర్‌లో 13 గదులు, సెకండ్ ఫ్లోర్‌లో 5 గదులతో పాటు విశాలమైన కౌన్సిల్ సమావేశమందిరాన్ని నిర్మాణం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, టౌన్‌ప్లానింగ్, రెవిన్యూతోపాటు వివిధశాఖలకు అవసరమైన మేరకు గదులు ఏర్పాటు చేశారు. మరో 30 లక్షలతో అన్ని గదుల్లో ఫర్నిచర్‌ను సమకూర్చారు. దీంతో మొత్తం 6 కోట్ల బడ్జెట్‌తో కొత్త పురపాలక సంఘం కార్యాలయం ప్రారంభానికి కొలువుదీరింది.

ఎమ్మెల్యే సహకారంతో..



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సహకారంతో కొత్త మున్సిపాలిటీ కార్యాలయం నిర్మాణం చేశాం. ఇది ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు అవసరాలకు, ప్రజలకు, ప్రభుత్వాధికారులకు ఎంతో అవసరం. ఐదేళ్ల ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కూడా ఇరుకుగా ఉన్న మున్సిపాలిటీ కార్యాలయంలో ఇబ్బందులు పడ్డారు. కొత్త కార్యాలయంలో అన్ని హంగులతో పాటు ప్రజల అవసరాల మేరకు ఎంతో విశాలంగా ఉంది.

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి

దూరాభారం..

విశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్యాలయం పట్టణానికి దూరంలో ఉండడంతో అక్కడికి రాకపోకలు సాగించే రవాణా వ్యవస్థ లేకపోవడంతో సామాన్యులకు కొంత మేరకు ఇబ్బంది కలిగించే విధంగా ఉందనే వాదనలున్నాయి. ఈ రహదారి గుండా ఆటోలు, బస్సుల రాకపోకలు పెరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందనే స్థానికులు అంటున్నారు.

అవసరాలకు అనుగుణంగా..



అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన మున్సిపాలిటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సహకారంతో నిర్మాణమైంది. శంషాబాద్ మున్సిపాలిటీ ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాం.

- మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్

'స్వచ్ఛతా హీ సేవా' 2కే రన్



2కే రన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: పచ్చదనంతో పాటు పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రాళ్లగూడ సర్వీసు రహదారిలో 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మణికొండ: నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–2008 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందులో భాగంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి, కోకాపేట, ఖానాపూర్, గండిపేట, మంచిరేవుల, నెక్నాంపూర్ తదితర గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

అత్తాపూర్: కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంట్లో నుంచి ఓ గృహిణి వెళ్లిపోయిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ గ్రామానికి చెందిన రుక్మిణి (35) భర్త నగేష్, కుమారుడితో కలిసి నివాసముంటోంది. సెప్టెంబర్ 25న సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన రుక్మిణి రాత్రి అయిన ఇంటికి రాలేదు. దీంతో భర్త నగేష్ చుట్టుపక్కల స్థానికులను, బంధువులను విచారించగా ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

అత్తాపూర్: ప్రణాళిక బద్ధంగా నాణ్యత ప్రమాణాలతో కూడిన రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేందర్‌గౌడ్ తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం డ్రైనేజీ నిర్మాణాలు, మంచినీటి వసతి, అండర్ గ్రౌండ్ నిర్మాణాలు పూర్తి చేసిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడితే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని ఆయన సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మణికొండ: ఆలయాలను సందర్శిస్తే మనకు మానసిక సంతృప్తితో పాటు ఆధ్యాత్మిక చింతన కలుగుతుందని, అలాంటి దేవాలయాలను వీలైనన్ని ఎక్కువగా నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, వెంకటేశ్వర కాలనీలో ప్రతిష్ఠాపన పూజలు జరుపుకుంటున్న గాయత్రీదేవి దేవాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణ అవకాశం వేల మందిలో ఒకరికి వస్తుందని, అలాంటి అవకాశాన్ని దక్కించుకుని ఆలయాన్ని నిర్మించిన ఉపేంద్రనాథ్ రెడ్డి సేవలు జీవితాంతం నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, పద్మారావు, శైలజ, నవీన్‌కుమార్‌లతో పాటు నాయకులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

పాఠశాలలో ఘనంగా బతుకమ్మ పండుగ



బతుకమ్మ ఆటలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్‌లోని పయనీర్ కాన్సెప్ట్ పాఠశాలలో బతుకమ్మ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మను తీరొక్క రంగు రంగుల పూలతో పేర్చి ఆట, పాటలతో బతుకమ్మను ఆడారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సంరెడ్డి ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ బతుకమ్మ పండుగలో మహిళలు తొమ్మిది రోజులు పాటలు పాడి, గౌరీదేవిని భక్తి శ్రద్ధలతో పూజిస్తారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణారెడ్డి, డైరెక్టర్లు, ప్రిన్సిపల్ రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలి



వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. మంగళవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో కలిసి ఆయన వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేతాజీనగర్, రాయదుర్గం, నల్లగండ్ల హుడాకాలనీ, నానక్‌రామ్‌గూడలలో సీసీ రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ నివాసముంటున్నారని, పెద్ద ఎత్తున స్థానికుల సమస్యలు తీర్చడానికి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జెడ్సీని కోరినట్లు ఆయన వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్‌ను కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. గచ్చిబౌలి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈలు విశాలాక్షి, ఆనంద్, ఏఈ రషీద్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్ యాదవ్, ఉపాధ్యక్షుడు రాయుడు, సీనియర్ నాయకులు సుమన్ పాల్గొన్నారు.

సందేహాల నివృత్తి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు

రాజేంద్రనగర్: మూసీ రివర్ బెడ్‌లో నిర్మాణాలు ఉండి నివాసముంటున్న ఇంటి యజమానులకు ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకునేందుకు ఆర్డీఓ కార్యాలయం, రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల పరిధిలో మొత్తం 339 నిర్మాణాలకు మార్కింగ్ వేసినట్లు తెలిపారు. ఇందులో 24 మంది నార్సింగి, జియగూడ ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు వెళ్లినట్లు వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు వెళ్లదలచిన వారు ఆర్డీఓ లేదా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

రాయదుర్గం: దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయంలోని రాజరాజేశ్వరి మాతను 3న షోడశ రాజరాజేశ్వరి దేవి అలంకారం, 4న బాలాత్రిపుర సుందరి దేవి, 5న గాయత్రిదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న లలితాదేవి, 8న మహాలక్ష్మీ, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11 మహిషాసురమర్దిని దేవి, 12 రాజరాజేశ్వరి దేవి అలంకారంతో నిత్యం ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ప్రతిరోజూ ఆలయంలో అమ్మవారికి ఉదయం 6 గంటలకు కుంకుమార్చన కార్యక్రమాలు అదేవిధంగా 10.30 గంటలకు లలితా సహస్రనామ పారాయణం చేయడానికి ఏర్పాట్లు చేశారు.

అలకాపూర్‌లో భూ వివాదం

మణికొండ: ఓ ప్లాటు ఇద్దరి పేర్లతో రిజిస్ట్రేషన్ జరగటంతో మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లో వివాదం నెలకొంది. దీంతో ఓ వర్గం అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల సహాయంతో పోలీసులు, మున్సిపల్ తదితర శాఖలపై ఒత్తిడి తెచ్చి ఏకంగా మున్సిపల్ అనుమతులను సైతం పొందారు. ఈ నేపథ్యంలో మరో వర్గంవారు మొదటగా తమకు రిజిస్ట్రేషన్ అయ్యిందని, దానిపై సర్వహక్కులు తమకే ఉన్నాయని వాదించారు. ఇదిలా ఉంటే మంగళవారం అనుమతులు పొందిన మొదటి వర్గంవారు నిర్మాణ పనులను మొదలు పెట్టే ప్రయత్నం చేయడంతో రెండో వర్గం అడ్డుకునేందుకు సదరు ప్లాట్ వద్దకు వెళ్లారు. దీంతో మొదటి వర్గంవారు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని రెండో వర్గంవారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తీరా స్టేషన్‌కు వెళ్లాక ఇరు వర్గాలు రాజీకి వచ్చి చెరో సగం ప్లాటును తీసుకునేందుకు అంగీకారం కుదిరినట్టు తెలిసింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో భూముల ధరలు పెరిగిపోతుండటంతో ఇలాంటి వివాదాలకు నిలయంగా మారుతుందని, ఇలాంటి వాటిని అరికట్టాల్సిన అధికారులే ప్రోత్సహిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక నైనా పోలీసులు, ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు భూ వివాదాల సృష్టికర్తలపై కఠినంగా వ్యవహరించాలని మున్సిపల్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



ఓ వర్గాన్ని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రతి ఒక్కరు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి



'స్వచ్ఛతా హీ సేవా'లో విద్యార్థులతో కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలతో పాటు విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని, తమ ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా 'స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత ' అనే థీమ్‌తో మంగళవారం బండ్లగూడ వార్డు కార్యాలయంలోని ఓపెన్ పాయింట్ వద్ద శుభ్రం చేయించి ముగ్గులు వేయించారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్సు విద్యార్థులతో అవగాహన ర్యాలీ చేపట్టారు.

రెడ్యూస్ రీసైకిల్ సెంటర్ పరిశీలన

ర్యాలీ అనంతరం లిబ్బం విల్లా వద్ద రెడ్యూస్, రీసైకిల్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సెంటర్ అందుబాటులో ఉండి ఒక సంవత్సర కాలం అయిందని, ప్రజలు నిరూపయోగమైన వస్తువులు, బట్టలు, పుస్తకాలు, ఆట వస్తువులు ఇక్కడ ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై అధికారులతో సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో మంగళవారం ఉపకమిషనర్ రవి కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా ఆస్తిపన్ను వసూలు బకాయిలపై సిబ్బంది, అధికారులతో చర్చించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. లక్ష రూపాయల నుంచి ఆపై ఎక్కువగా ఉండి ఆస్తిపన్ను చెల్లించని వారి వివరాలను ప్రతిరోజు పరిశీలించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల ఆస్తిపన్ను విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి పన్నులను వసూలు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన డీసీ రవి కుమార్